

## ఆర్టీసీ సురక్షితమేనా..?

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం.. శుభప్రదం... ఇది ఆర్టీసీ సంస్థ నినాదం. సుశిక్షితులైన డ్రైవర్లతో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తారనే ప్రశంసలు సంస్థకు ఉన్నాయి. 8లో▸



## లుక్స్.. అదుర్స్

వేసవిలో కళ్ల రక్షణకు కూలింగ్ గ్లాసెస్ వాడకం పెరుగుతోంది. మండుటెండల్లో బయటకు వెళ్తున్నారంటే పిల్లలు, పెద్దలు సన్‌గ్లాసెస్ వాడే వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. 9లో▸

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
43.6 /28.4

ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు ఉంటాయి. ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోత అధికంగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి.

# మా తుఝే సలాం!

**భైంసాటౌన్:** ఎవరు రాయగలరూ అమ్మా అను మాటకన్న కమ్మని కావ్యం.. ఎవరు పాడగలరూ అమ్మా అనురాగం తీయని రాగం'అంటూ అమ్మ గొప్పదనాన్ని తనపాట ద్వారా వ్యక్తం చేశారు ఓ కవి. అమ్మను మించి దైవం ఉన్నదా.. అంటూ ఎందరో కవులు అమ్మను వర్ణించారు. పదాలకు, మాటలకు అందని ఉన్నతమైన భావవ్యక్తీకరణ 'అమ్మ'.. దేవుడు ప్రతీ జీవికి ఇచ్చిన గొప్ప వరం అమ్మ. తనకన్నా తన పిల్లల గురించి ఆలోచించే దేవత అమ్మ. అందుకే 'ప్రపంచంలో తల్లిని మించిన యోధులు ఎవరూ లేరు..' అని ఓ సినిమాలో తల్లి గొప్పదనాన్ని ఒక్క వాక్యంలో చెప్పాడు. ఈ డైలాగ్ విన్న ప్రతీ సారి.. మనసులో తెలియని భావం, తల్లి రూపం, ఆమె మన కోసం చేసిన త్యాగాలు, చూపించిన ప్రేమ.. ఇలా అన్నీ గుర్తుకువస్తాయనడంలో ఏ మాత్రం సందేహం లేదు. అంత గొప్పటి మాతృమూర్తి గురించి చెప్పాలంటే ప్రత్యేకంగా ఒక రోజు మాత్రమే ఉంటే సరిపోదు. కానీ ఆమెను కీర్తించడానికి, గొప్పగా చెప్పకోవడానికి సంవత్సరంలో కనీసం ఒక్క రోజు ఉండాలన్న భావనతో ఏటా మే రెండో ఆదివారం మాతృ దినోత్సవం నిర్వహిస్తున్నారు. మే 14 మాతృ దినోత్సవం సందర్భంగా 'అమ్మ' అన్న పదానికి అసలైన అర్థం చూపుతూ దివ్యాంగులైన తమ పిల్లల సంతోషంలోనే తమ ఆనందం వెతుక్కుంటున్న జిల్లాలోని కొంతమంది మాతృమూర్తులపై ప్రత్యేక కథనం.

## అమ్మే ఆయన చేతులు..



శంకర్‌కు అన్నం తినిపిస్తున్న భూమవ్వ

**సారంగాపూర్:** మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన గుజ్జ చిన్నముత్యం–భూమవ్వ దంపతులకు ముగ్గురు సంతానం. శంకర్ పెద్దవాడు. ఇద్దరు ఆడపిల్లలు ముత్తవ్వ, గంగవ్వ. శంకర్ అంగవైకల్యంతో జన్మించాడు. రెండు చేతులు లేవు. కొడుకు పుట్టాడన్న ఆనందం ఆ దంపతుల కళ్లలో ఎంతో సేపు నిలువ లేదు. పురిటినొప్పుల బాధ తగ్గక ముందే తన బిడ్డను చూసిన భూమవ్వ హృదయం తల్లడిల్లింది. అంతలోనే తన బాధను దిగమింగి చేతులు లేకుంటే తన కొడుకు కాకుండా పోడని భావించింది. శంకర్‌కు అమ్మే చేతులైంది. పళ్లు తోమడం దగ్గర్నుంచి అన్ని పనులు భూమవ్వనే చేస్తుంది. కొడుకును డిగ్రీ వరకు చదివించింది. వైకల్యమే శంకర్‌ను చూసి భయపడే రీతిలో కాళ్లతో రాస్తూ కాళ్లే చేతులుగా మార్చుకున్నాడు శంకర్. స్మార్ట్ ఫోన్‌సైతం కాళ్లతో ఆపరేటింగ్ చేస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు. తనకుమారుడు అందరిలాగే ఉద్యోగం చేయాలని ఆశపడుతోంది భూమవ్వ.




## అన్నీ తానై...



కూతురు వైష్ణవితో తల్లి ఉమారాణి

భైంసా పట్టణానికి చెందిన మహిపాల్, ఉమారాణి దంపతుల కూతురు వైష్ణవి(25). పుట్టినప్పటి నుంచే మానసిక వైకల్యంతో బాధపడుతోంది. వృత్తిరీత్యా వైద్యుడైన మహిపాల్ రోజువారీ పనుల్లో బిజీగా ఉండడంతో వైష్ణవికి తల్లి ఉమారాణి అన్నీ తానై చేస్తోంది. కూతురు పరిస్థితి తలచుకుని కలతచెందినా.. గుండెనిబ్బరం చేసుకుని బిడ్డను సంతోషంలో తమ ఆనందం వెతుక్కుటుంన్నామని తల్లి ఉమారాణి చెబుతోంది.

## కొడుకుకు సపర్యలు..



కొడుకు రాహుల్‌తో తల్లి తిరుమల

భైంసాలోని పిప్రికాలనీకి చెందిన చౌండి రాజేశ్వర్, తిరుమల దంపతుల కొడుకు రాహుల్(21) పుట్టుకతో దివ్యాంగుడు. నడుము కింది భాగం నుంచి అవయవాలు పనిచేయవు. దీంతో నడవలేని కొడుకుకు తల్లి అన్నీతానై సపర్యలు చేస్తోంది. వ్యాపారపనుల్లో భర్త బిజీగా ఉంటే, తాను బిడ్డకు ఎలాంటి లోటు లేకుండా చూస్తున్నాని చెబుతోంది తిరుమల. ఇటీవల ఓపెన్‌లో పదో తరగతి పరీక్షలకు కూడా హాజరయ్యాడని, ప్రస్తుతం రాహుల్ తన పనులు తాను చేసుకుంటున్నాడని చెబుతోంది.

## అమ్మ ప్రోత్సాహంతోనే...

**భైంసాటౌన్:** భైంసా మండలం వాలేగాంకు చెందిన పంచగుడి అనూషాబాయి, లక్ష్మణ్ దంపతులకు ఇద్దరు కొడుకులు, కూతురు. కొడుకులు మహేశ్, శ్రీకాంత్ ఇద్దరు పుట్టుకతోనే అంధులు. భైంసా వాసులు చాలామందికి పంచగుడి మహేశ్ సుపరిచితుడే. ఎందుకంటే దివ్యాంగుడైన మహేశ్ డిగ్రీ పూర్తి చేసి, ఎవరిపై ఆధారపడకుండా సొంతంగా దివ్యాంశక్తి ఎంటర్‌ప్రైజెస్ పేరిట క్లీనింగ్ ప్రొడక్ట్స్ యూనిట్ నెలకొల్పాడు. ఆస్పత్రులు, విద్యాసంస్థలతో తానే స్వయంగా మార్కెటింగ్ చేస్తూ అందరితో శభాష్ అనిపించుకుంటున్నాడు. తమ్ముడు శ్రీకాంత్‌ను డిగ్రీ చదివిస్తున్నాడు. అయితే, ఇదంతా తన తల్లి అనూషాబాయి ప్రోత్సాహంతోనే చేయగలుతున్నానని చెబుతున్నాడు. ఇద్దరు కొడుకులు అంధులైనా తమను ఎన్నడూ అలా చూడలేదని, ఏం చేసినా వెన్నుతడుతోందని చెబుతున్నాడు. అమ్మకు ఎప్పుడూ రుణం తీర్చుకోలేనిదని అన్నాడు మహేశ్.



తల్లిదండ్రులు, చెల్లి, తమ్ముడితో పంచగుడి మహేశ్

## శైలజకు తల్లే సర్వస్వం..

**లోకేశ్వరం:** మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన తరుడం సాయన్న–భూమవ్వ దంపతులకు కుమార్తె శైలజ, కుమారుడు రాజేశ్వర్. మొదట జన్మించిన శైలజ పుట్టుకతోనే శారీరక, మానసిక దివ్యాంగురాలు. 18 ఏళ్లు వచ్చినా చిన్న పిల్లలానే ఉంటుంది. శైలజకు తల్లి భూమవ్వే అన్నీ. తన పనులు తాను స్వయంగా ఏదీ చేసుకోలేని బిడ్డను చూసి భూమవ్వ ఏనాడు విసుగు చెంద లేదు. నిద్ర లేవగానే ఇంటి పనితోపాటు కూతురు సపర్యలన్నీ తనే చూసుకుంటుంది.



18 ఏళ్ల శైలజకు అన్నంతినిపిస్తున్న తల్లి భూమవ్వ

## పాతికేళ్ల పసివాళ్లు..

**లోకేశ్వరం:** మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన కుతాడి లక్ష్మి–గంగారాం దంపతులకు నలుగురు కుమారులు. అందులో శ్రీనివాస్(28), గంగన్న(25) పుట్టుకతోనే మానసిక దివ్యాంగులు. ఎన్ని ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా మెరుగవ్వలేదు. కనీసం నడవ లేరు. వీళ్ల బయటకు వెళ్లాలంటే తల్లిదండ్రులు మోయాల్సిందే. మానసిక వైకల్యం కారణంగా వారికి ఆకలి తెలియదు. బాధ తెలియదు. అవసరాలన్నీ అమ్మ లక్ష్మి తెలుసుకుని చూసుకుంటుంది. పాతికేళ్లుగా కుమారులకు సపర్యలు చేస్తూనే ఉంది. పాతికేళ్లు దాటిన బిడ్డలను ఇప్పటికీ పసివాళ్లలానే చూసుకుంటుంది.



గంగారాం, శ్రీనివాస్‌కు అన్నం తినిపిస్తున్న కుతాడి లక్ష్మి

# డైలామాలో జేపీఎస్‌లు..!

- జాయినింగ్ దిశగా కార్యదర్శులు..!
- సర్కారుతోపాటు కుటుంబాల ఒత్తిడి
- ఇప్పటివరకు విధుల్లోకి 28 మంది



సమ్మెలో జూనియర్ పంచాయతీ సెక్రెటరీలు

**నిర్మల్:** ప్రభుత్వంతోపాటు కుటుంబం నుంచి ఒత్తిడి పెరగడంతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తిరిగి జాయినింగ్ బాట పడుతున్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలంటూ 16 రోజులగా నుంచి సమ్మె కొనసాగుతున్నా సర్కారు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం, మరోవైపు ఈ ఉన్న ఉద్యోగం కూడా పోతుందేమోనన్న కుటుంబసభ్యుల ఆందోళనల మధ్య చాలామంది డైలామాలో ఉన్నారు. ఇదేక్రమంలో మిగతా జిల్లాలతోపాటు జిల్లాలోనూ కొందరు విధుల్లో చేరడం మిగితావాళ్ల నమ్మకం సన్నగిల్లేలా చేస్తోంది. ప్రభుత్వం శనివారం సాయంత్రం వరకు గడువు పెట్టడంతో పలువురు విధుల్లో చేరారు.

**రెండువైపులా ఒత్తిడి..**

జాయిన్ అయితే ఉంటారు..లేదంటే మొత్తానికే ఉండరంటూ.. ప్రభుత్వం సీరియస్‌గా చెప్పడంతో చాలామంది జేపీఎస్‌లు టెన్షన్‌కు లోనయ్యారు. వీరికంటే వీరి కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయి. ఎక్కడ ఉన్న ఉద్యోగం ఊడుతుందో, వీరి స్థానంలో మళ్లీ వేరేవాళ్లను తీసుకుంటారో అన్న ఆందోళన కనిపిస్తోంది. దీంతో భార్యాపిల్లలు, తల్లిదండ్రులతో పాటు అత్తామామలూ జేపీఎస్‌లపై ఒత్తిడి పెంచుతున్నారు. సర్కారు స్పందిస్తుందన్న ఆశ సన్నగిల్లడం, ఇంటి నుంచి ఒత్తిడి పెరుగుతుండటంతో రెండురోజులుగా జేపీఎస్‌లు డైలామాలో ఉన్నారు. రాత్రి 11 గంటలకు సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు.

**రెండురోజుల్లో 28మంది..**

చివరి అవకాశమంటూ సర్కారు చెప్పడంతో జిల్లాలో శుక్ర, శనివారాల్లో కలిపి 28 మంది జేపీఎస్‌లు విధుల్లో చేరారు. మొత్తం 326 మందికి గాను ఒక్కొక్కరుగా 28 మంది తిరిగి చేరడం, మిగితావారిపైనా ప్రభావం చూపుతోంది. మరోవైపు చుట్టుపక్కల జిల్లాల్లో జేపీఎస్‌లు చేతులెత్తేస్తున్నట్లు సమాచారం రావడంతో జిల్లాలోనూ కార్యదర్శులు ఏంచేయాలన్న ఆలోచనలో పడ్డారు. నేడు,రేపు మిగితావాళ్లు కూడా విధుల్లో చేరుతారని అధికారులు చెబుతున్నారు.



## న్యూస్‌రీల్

### కర్ణాటక స్ఫూర్తితో గెలుస్తం



సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

**నిర్మల్:** కర్ణాటక ఎన్నికల్లో గెలిచిన స్ఫూర్తితో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలుస్తామని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. కర్ణాటకలో తమ పార్టీ విజయం సాధించడంతో జిల్లా కేంద్రంలోని ఐబీలో శనివారం సంబురాలు నిర్వహించారు. మిఠాయిలు పంచుకున్నారు. నిర్మల్ నియోజకవర్గంలో పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తామని తెలిపారు. ఇందులో జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్ ఇమ్రానుల్లా, పార్టీ సీనియర్ నాయకులు అల్లూరి మల్లారెడ్డి, ఎంబడి రాజేశ్వర్, అర్జుమంద్‌అలీ, దశరథ రాజేశ్వర్, జునైద్‌మెమన్, అజహర్, అల్మాస్, మతిన్, మొయినొద్దీన్, కీజర్, షాహీన్, గణేశ్, అర్షద్ తదితరులు పాల్గొన్నారు.

### 'ఏక్తాయాత్ర విజయవంతం చేయండి'



మాట్లాడుతున్న రమాదేవి

**భైంసాటౌన్:** కరీంనగర్‌లో నిర్వహించే హిందూ ఏక్తాయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు పి.రమాదేవి కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించే యాత్రకు అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వశర్మ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌చుగ్ హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలాలని కోరారు.

# రెమ్యునరేషన్ రాలె!

- ఇంటర్ మూల్యాంకనం ముగిసి 22 రోజులు
- డబ్బుల కోసం ఎదురు చూస్తున్న అధ్యాపకులు
- వాల్యుయేషన్ విధులు నిర్వహించిన 500 మంది..



ఇంటర్ నోడల్ అధికారి కార్యాలయం

**లక్ష్మణచాంద:** జిల్లాలో ఇంటర్ విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకనం ముగిసి 22 రోజులు గడిచింది. ఫలితాలు కూడా విడుదలయ్యాయి. కానీ మూల్యాంకనం విధులు నిర్వహించిన అధ్యాపకులకు మాత్రం రెమ్యునరేషన్ అందలేదు. ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం మూల్యాంకనం ఏప్రిల్ 02 నుంచి 20 వరకు కొనసాగింది. జిల్లాలో 500 మంది అధ్యాపకులు ఈ విధుల్లో పాల్గొన్నారు.

**రెండేళ్లుగా నిర్మల్‌లో..**

గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉన్నప్పుడు ఇంటర్ మూల్యాంకనం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోనే నిర్వహించేవారు. నిర్మల్ జిల్లా కేంద్రంగా ఏర్పడిన తరువాత జిల్లా నుంచి ఆదిలాబాద్ వెళ్లే అధ్యాపకులకు దూరభారం కావడంతోపాటు ప్రయాణం ఇబ్బందిగా మారడం, సమయం వృథా కావడంతో గత సంవత్సరం నుంచి నిర్మల్ జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలోనే ఇంటర్ మూల్యాంకనం నిర్వహిస్తున్నారు. ఈసారి నిర్వహించిన మూల్యాంకనంలో 500 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు(ఏఈలు) పేపర్ వాల్యుయేషన్‌లో పాల్గొన్నారు.

**రెమ్యునరేషన్ ఇలా..**

ఇంటర్ మూల్యాంకనం విధులు నిర్వహించిన ఏఈలకు ఒక్కో పేపర్ వాల్యుయేషన్ చేసినందుకు రూ.23.66, డీఏ రోజుకు స్థానికులకు రూ.183, 50 కిలో మీటర్ల దూరం నుంచి వచ్చేవారికి రూ.350, 50 కిలోమీటర్ల మించి దూరం నుంచి వచ్చే వారికి రూ.703 రెమ్యునరేషన్ చెల్లిస్తారు. ఒక ఏఈ రోజుకు 30 జవాబు పత్రాలు మూల్యాంకనం చేయాలి.

**గతంలో ఇలా...**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉన్నప్పుడు వాల్యుయేషన్ ప్రక్రియ ముగిసిన చివరి రోజునే అధ్యాపకులకు రెమ్యునరేషన్ నగదు రూపంలో చెల్లించే వారు. నాలుగేళ్ల నుంచి అధ్యాపకుల నుంచి బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తున్నారు. వాల్యుయేషన్ ముగిసిన వారంలోపే డబ్బులు వారి ఖాతాల్లో జమ చేసేవారు. ఈసారి మాత్రం వాల్యుయేషన్ ప్రక్రియ ముగిసి 22 రోజులు దాటినా రెమ్యునరేషన్ డబ్బులు మాత్రం రాలేదు. ఇప్పటికైనా ఇంటర్ బోర్డు అధికారులు స్పందించి మూల్యాంకనం డబ్బులు చెల్లించాలని అధ్యాపకులు కోరుతున్నారు.

**జిల్లా సమాచారం...**

| | |
|---|---|
| ఇంటర్ మూల్యాంకనం ప్రారంభం | 02-04-2023 |
| మూల్యాంకనం ముగిసినది | 20-04-2023 |
| మూల్యాంకనంలో పాల్గొన్న ఏఈలు | 500 |
| జిల్లాకు రావాల్సిన మొత్తం డబ్బులు | రూ.7,54,693 |

**ఇంటర్ బోర్డుకు పంపించాం**

జిల్లా కేంద్రంలో ఇంటర్ మూల్యాంకనం ఏప్రిల్ 20న ముగిసింది. మూల్యాంకనం పూర్తయిన వెంటనే మూల్యాంకనం డబ్బుల కోసం ఇంటర్ బోర్డు వారికి అధ్యాపకుల రెమ్యునరేషన్ వివరాలు, బ్యాంక్ ఖాతాల వివరాలు అప్‌లోడ్ చేశాం. అక్కడ నుంచి నేరుగా అధ్యాపకుల ఖాతాల్లోనే జమవుతాయి.

– పరశురామ్ నాయక్, ఇంటర్ నోడల్ అధికారి, నిర్మల్

## నిత్యావసర సరుకులు ఉచితంగా అందించాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న మహిళలు

**నిర్మల్‌ఖిల్లా:** పేద మధ్య తరగతి కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులు ఉచితంగా అందించాలని ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెంచడంతో పేద ప్రజలు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో 12 రకాల నిత్యవసర వస్తువులను ఉచితంగా అందించాలని కోరారు. పెట్రోల్, వంట గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

## తంబాకు ఉత్పత్తులతో రోగాలు తప్పవు

**సారంగపూర్:** తంబాకు ఉత్పత్తులను నమల డం వలన నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో పాటు ఇతర రోగాలు వస్తాయని ఎంఎల్‌హెచ్‌పీ షాలిని అన్నారు. మండలంలో ని జామ్ గ్రామంలో తంబాకు ఉత్పత్తులు వినియోగించడం ద్వారా కలిగే నష్టాలు, వ్యాధుల గురించి శనివారం అవగాహన కల్పించారు. బీడీ, సిగరెట్లు ఎక్కువగా తాగేవారికి ఊపిరితిత్తుల క్యాన్సర్, నోటి క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువ అన్నారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు.

## దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

**నిర్మల్‌ఖిల్లా:** జిల్లాలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు త్వరగా పరిష్కరించాలని స్పందన దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇసాక్ అలీ అన్నారు. సంఘ భవనంలో శనివారం మాట్లాడారు. అర్హులైన దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతీనెల 5వ తేదీలోపు పెన్షన్లు ఇవ్వాలన్నారు. ఆయన వెంట జిల్లా కార్యవర్గ సభ్యులు నిషిత, శ్రీనివాస్, శివకుమార్ ఉన్నారు.

## జేపీఎస్ మరణానికి ప్రభుత్వానిదే బాధ్యత

**ముధోల్:** పంచాయతీ కార్యదర్శి బైరి సోని ఆ త్మహత్య బాధాకరమని, ఆమె మరణానికి ప్ర భుత్వమే బాధ్యత వహించాలని టీజేఎస్ వి ద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ వినోద్ డిమాండ్ చేశారు. శనివారం మాట్లాడుతూ న్యా యమైన సమస్యలను మానవీయ కోణంలో ఆ లోచించి పరిష్కరించాలని కోరారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు వారి న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని సమ్మె చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో పంచాయతీ కార్యదర్శులు ఆత్మహత్య చే సుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికయినా ప్రభుత్వం స్పందించి వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

# మహలింగిలో చిరుత

- అటవీ ప్రాంతంలో సంచారం
- లేగదూడపై దాడి
- పాదముద్రలను గుర్తించిన అటవీశాఖ అధికారులు

**తానూరు:** మండలంలోని మహలింగి అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచారంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన నవాటే రాంచందర్ అనే రైతు శుక్రవారం ఆవులను మేపి సాయంత్రం పొలంలో కట్టేసి రాత్రికి ఇంటికి వచ్చాడు. లేగదూడపై రాత్రి చిరుత దాడిచేసి చంపి తిన్నది. శనివారం ఉదయం రైతు పొలం వద్దకు వెళ్లి చూడగా లేగదూడ చనిపోయి కనిపించింది. ఘటన స్థలంలో చిరుత పాదముద్రలు కనిపించడంతో బాధిత రైతు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాడు. బీట్ అధికారి మహేశ్ గ్రామానికి చేరుకుని పాదముద్రలను పరిశీలించారు. చిరుత ఆనవాళ్లుగా గుర్తించారు. కొద్ది రోజులుగా చిరుత ఈ ప్రాంతంలో సంచరిస్తోందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుట్ట ప్రాంతానికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. దీంతో మహలింగి గ్రామానికి చెందిన రైతులు వ్యవసాయ పనులకు వెళ్లడానికి జంకుతున్నారు. చిరుతను పట్టుకుని తరలించాలని కోరుతున్నారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న బీట్ అధికారి మహేశ్

## క్లుప్తంగా

### బాసరలో భక్తుల రద్దీ



బాసర ఆలయంలో భక్తుల సందడి

భైంసా: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ముందుగా గోదావరి నదిలో స్నానాలాచరించి సూర్యేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం బాసర సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. అక్షర శ్రీకార మండపంలో చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు చేయించారు.

### సెల్‌పాయింట్‌లో అగ్నిప్రమాదం



ప్రమాదంలో కాలిపోయిన సామగ్రి

కడెం: మండల కేంద్రానికి చెందిన దుర్గం మల్లేశ్ సెల్ పాయింట్‌లో శుక్రవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సెల్‌ఫోన్‌లు, సామగ్రి కాలిపోయాయి. దీంతో సుమారు లక్ష రూపాయాల వరకు నష్టం వాటిల్లినట్లు మల్లేశ్ పేర్కొన్నాడు.

### నిప్పంటుకుని మొక్కజొన్న దగ్ధం



దగ్ధమవుతున్న పంట

కుంటాల: మండలంలోని అందకూర్ శివారులోని పడకంటి దత్తాత్రి అనే రైతుకు చెందిన మొక్కజొన్న పంట ప్రమాదవశాత్తు దగ్ధమైంది. స్థానికుల వివరాల ప్రకారం... పంట పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నందున నిప్పురవ్వలు చెలరేగడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దత్తాత్రి కుమారుడు అదే సమయంలో పంట చేనులోకి రాగా ప్రమాదంలో మొక్కజొన్న కాలిపోతుండడం గమనించిన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మంటలు ఆర్పివేసినా ఫలితం లేకపోవడంతో భైంసా అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంతో అర ఎకరంలో పంట నష్టపోయిందని, రూ.50వేలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.



# ఆర్టీసీ సురక్షితమేనా..?

'ఏప్రిల్ 6వ తేదీన మంచిర్యాల ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఆదిలాబాద్ డిపోకు చెందిన కండక్టర్ బాతూరి గంగారాం (54) మృతి చెందడం విషాదాన్ని నింపింది. మంచిర్యాల డిపోకు చెందిన డ్రైవర్ హైదరాబాద్ నుంచి బస్సు నడిపి డిపోలో నిలిపివేసే క్రమంలో మధ్యాహ్న భోజనానికి వెళ్తున్న గంగారంను చూసుకోకుండా వెళ్లడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. డ్రైవర్ నిర్లక్ష్యమే ఇందుకు కారణమని గుర్తించారు. విశ్రాంతి లేకుండా బస్సును నడిపి విధులను త్వరగా ముగించుకోవాలనే తొందరపాటుతో నిండు ప్రాణం బలైందని ఆర్టీసీ డ్రైవర్లు కలత చెందారు.'

'ఏప్రిల్ 9వ తేదీన నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం మెహబూబా ఘాట్స్ వద్ద ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముఖరాబీ గ్రామానికి చెందిన బావ బామ్మర్దులు నాందేవ్, శ్రీకాంత్ మృతి చెందారు. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఇచ్చోడవైపు వెళ్తున్న నాందేవ్, శ్రీకాంతుల ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. నాందేవ్ అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాంత్ నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.'

'ఫిబ్రవరి 6వ తేదీన ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం సమీపంలో తెల్లవారుజామున ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు బోల్తా పడింది. ఉదయం 6 గంటలకు హైదరాబాద్ వెళ్తున్న ఈ బస్సు డ్రైవర్ సదేష్‌కు ఛాతిలో నొప్పి రావడంతో బస్సులో నుంచి దూకేశాడు. ఈ బస్సు అదుపు తప్పడంతో కండక్టర్ శ్రీనివాస్‌తో పాటు బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. కేవలం ముగ్గురు ప్రయాణికులు మాత్రమే ఉండడంతో పెను ప్రమాదం తప్పింది.'



ఆర్టీసీ బస్సు తల పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందిన బాతూరి గంగారాం (ఫైల్)

- పెరిగిపోతున్న ఆర్టీసీ బస్సు ప్రమాదాలు
- వరుస డ్యూటీలతో డ్రైవర్లపై ఒత్తిడి
- కానరాని శిక్షణ తరగతులు

ఆదిలాబాద్: ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం.. శుభప్రదం... ఇది ఆర్టీసీ సంస్థ నినాదం. సుశిక్షితులైన డ్రైవర్లతో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తారనే ప్రశంసలు సంస్థకు ఉన్నాయి. ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణించడం కన్నా ప్రజా రవాణా వ్యవస్థ అయినా ఆర్టీసీ బస్సులో నిర్భయంగా తమ ప్రాంతాలకు చేరుకోవడానికి ప్రయాణికులు మొగ్గు చూపుతారు. గత కొన్ని నెలలుగా ఈ పరిస్థితిలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రీజియన్ పరిధిలో ఆర్టీసీ బస్సుల ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ఆదాయమే పరమావధిగా సంస్థ ముందుకు సాగుతూ ఉద్యోగులపై ఒత్తిడి తీసుకు వస్తున్న కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయనే చర్చ సంస్థలోనే అంతర్గతంగా బాహాటంగా సాగుతోంది.

**ఆదాయార్జనే పరమావధిగా...**

నష్టాల బాటలో పయనిస్తున్న సంస్థను లాభాల బాటను పట్టించే క్రమంలోనే ప్రమాదాల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఆదాయ ఆర్జనకు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాల్సిన ఆర్టీసీ అధికారులు డ్రైవర్లు, కండక్టర్లపై ఒత్తిడి పెంచుతున్నారు. దీంతో ప్రమాదాలకు కారణంగా తెలుస్తోంది. డ్రైవర్ల విషయానికి వస్తే కేఎంపీఎల్ సాధించాలని వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్, విజయవాడ, గుంటూరు లాంటి దూర ప్రాంతాలకు వెళ్లే సూపర్ లగ్జరీ సర్వీసుల్లో టిమ్ డ్రైవర్లను నియమిస్తున్నారు. వారిపై ఒత్తిడి పెరుగడంతో డ్రైవింగ్‌పై దృష్టి నిలపలేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

**అద్దె బస్సులూ కారణమే...**

నిర్వహణ ఖర్చులను తగ్గించుకుంటూ ఇన్‌కం పెంచుకోవాలని భావిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బందిని ప్రత్యక్షంగా, పరోక్షంగా తొలగించి వేస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో భాగంగానే ప్రైవేట్ హైర్ బస్సులను పెద్ద సంఖ్యలో పెంచుకుంటూ నూతన బస్సులను సమకూర్చుకోవడాన్ని నిలిపివేసింది. దీంతో ప్రైవేట్ హైర్ బస్సు యజమానులు ఖర్చులను మిగిల్చుకునే ప్రయత్నంలో అనుభవం లేని డ్రైవర్లను నియమిస్తున్నారు. డ్రైవర్లపై పర్యవేక్షణ, వారికి తగిన శిక్షణ లేక ఈ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పలువురు పేర్కొంటున్నారు.



నేరడిగొండ బంధం క్రాసింగ్ రోడ్డు వద్ద ఆర్టీసీ బస్సు, వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్ ప్రమాద దృశ్యం



బోథ్ క్రాస్ రోడ్ వద్ద ఆర్టీసీ బస్సు కారు ప్రమాద దృశ్యం

### సేఫ్టీ వార్డెన్లను నియమించాం



ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో బస్సు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ డిపో పరిధిలో ప్రమాదాల నివారణకు డ్రైవర్లకు సలహాలు, సూచనలు ఇవ్వడానికి సేఫ్టీ వార్డెన్లను నియమిస్తున్నాం. అద్దె బస్సు డ్రైవర్లకు ప్రత్యేకంగా శిక్షణ అందిస్తున్నాం. ఇతర వాహనాలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేస్తున్నాం.

– జానీ రెడ్డి, ఆదిలాబాద్ ఆర్టీసీ ఆర్‌ఎం

### మరికొన్ని ఘటనలివీ...

- ఫిబ్రవరి 18వ తేదీన ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని బంధం క్రాసింగ్ రోడ్ వద్ద జాతీయ రహదారిపై ఆదిలాబాద్ నుంచి ఆర్టీసీ ఎక్స్ ప్రెస్ బస్సు వాటర్ ట్యాంకర్‌తో కూడిన ట్రాక్టర్ పరస్పరం ఢీకొట్టుకోవడంతో ఇద్దరు ప్రయాణికులు, ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి.
- మార్చి 13వ తేదీన ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ సమీపంలోని జాతీయ రహదారి 44పై ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న నిర్మల్ డిపోకు చెందిన ఎక్స్ ప్రెస్ బస్సు నాగ్‌పూర్ వైపు నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న లారీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో బస్సు ముందు అద్దాలు ధ్వంసం కాగా ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.
- ఏప్రిల్ 18వ తేదీన కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని ఘాట్లపై ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న కారును ఆదిలాబాద్ నుంచి ఆసిఫాబాద్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులోని డీజిల్ ట్యాంక్ పగిలి కారు పూర్తిగా దగ్ధమైంది. కారుకు మంటలు అంటుకోగా కారు యజమాని పవన్‌కుమార్ అందులో నుంచి బయటకు దూకేశాడు. బస్సు డ్రైవర్ పై కేసు నమోదైంది.
- మే 8వ తేదీన ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ నుంచి నేరడిగొండ మండలం తేజపూర్ వైపు వెళ్తున్న కారును బోథ్ క్రాస్ రోడ్డు వద్ద ఆర్టీసీ బస్సు ఢీ కొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారికి, బస్సులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



కెరమెరి ఘాట్స్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో దగ్ధమవుతున్న కారు

# కాంగ్రెస్ నాయకుల కొట్లాట..



సెల్ఫీరాడ్‌తో కాంగ్రెస్ కార్యకర్త



ప్రశాంత్ చెవిలోంచి కారుతున్న రక్తం

- నంబరాల్లో బాహాబాహీ
- జిల్లా నేతల సమక్షంలోనే ఘటన

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ఇద్దరు బాహాబాహీకి దిగారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం పార్టీ విజయం సాధించిన నేపథ్యంలో పట్టణంలోని వినాయక్ చౌక్‌లో శనివారం సంబరాలు చేసుకున్నారు. టపాసులు పేల్చే క్రమంలో పట్టణ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మేకల ప్రశాంత్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షకీల్, ఆయన సోదరుడు ముఖీమ్‌లు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్, ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత సమక్షంలోనే ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. సంఘటన స్థలంలో ఉన్న వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల ప్రశాంత్ సోషల్ మీడియాలో ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన నాయకుడికి వ్యతిరేకంగా పోస్ట్ పెట్టాడు. దీంతో ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు నగేశ్ ఈ విషయంలో వారించాడు. విషయం మూడు రోజుల క్రితం జరిగింది. ఈ పోస్టులపై కాంగ్రెస్ మైనార్టీ సెల్ చైర్మన్ షకీల్ ఎందుకు పోస్టులు పెట్టావని ప్రశాంత్‌కు ఫోన్ చేయగా, అతను దురుసుగా మాట్లాడారని తెలిసింది. శనివారం సంబరాల సమయంలో షకీల్ సోదరుడు సెల్ఫీ రాడ్‌తో దాడికి దిగాడు. దీంతో ప్రశాంత్‌కు చెవిలోంచి రక్తం వచ్చింది. అక్కడున్న వారు వీరిని విడిపించి గొడవ సద్దుమణిగింపజేశారు. ఆ తర్వాత ప్రశాంత్ వన్‌టౌన్‌లో షకీల్, ఆయన సోదరుడిపై ఫిర్యాదు చేశాడు.

## రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి.. కుమారుడికి గాయాలు






జాదవ్ మనీశ్ మృతదేహం, గాయాలపాలైన కుమారుడు లోకేశ్

భైంసారూరల్: ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ప్రమాదంలో తండ్రి మృతిచెందగా కుమారుడికి గాయాలయ్యాయి. ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం.. కుంటాల మండలంలోని అంబుగాం గ్రామానికి చెందిన జాదవ్ మనీశ్(35) టెంట్‌హౌజ్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం తన కుమారుడు లోకేశ్‌తో ద్విచక్ర వాహనంపై భైంసాకు వస్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ సుంక్లి గ్రామ సమీపంలో వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మనీశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. గాయాలపాలైన లోకేశ్‌ను 108లో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## శుభకార్యానికి వెళ్లి అనంత లోకాలకు...

- విద్యుత్‌షాక్‌తో వ్యక్తి దుర్మరణం



జాదవ్ విజేష్ మృతదేహం

సారంగపూర్: అత్తవారి ఇంటికి శుభకార్యానికి వెళ్లి తిరిగిరాని లోకాలకు వెళ్లిన విషాద ఘటన మండలంలోని బోరింగ్ తండాలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని మహవీర్‌తండాకు చెందిన జాదవ్ విజేష్(40) శుక్రవారం మండలంలోని బోరింగ్‌తండాలో తన అత్తగారి ఇంటికి శుభకార్యం నిమిత్తం కుటుంబ సమేతంగా హాజరయ్యాడు. అయితే అక్కడ తనకు మరో సమీప బంధువు సక్కారాం ఇంటి స్లాబుపై భోజనం చేయడానికి వెళ్లాడు. స్లాబుకు అమర్చిన ఇనుప చువ్వలకు ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా కావడంతో వాటికి తగిలిన విజేష్ విద్యుత్‌షాక్‌కు గురై పక్కనే రేకులపై పడిపోయాడు. గమనించిన బంధువులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతిచెందాడు. దీంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణసాగర్ తెలిపారు.

## చెరువులో పడి వృద్ధురాలి మృతి

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామ చెరువులో ప్రమాదవశాత్తు గంగాబాయి(75) వృద్ధురాలు మృతిచెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... తానూరు మండలంలోని హంగిర్గ గ్రామానికి చెందిన గంగాబాయి శనివారం భైంసా మండలంలోని ఇలేగాంలో తన కూతురి వద్దకు వెళ్లే క్రమంలో దారి తప్పి కామోల్‌కు వెళ్లింది. ప్రమాదవశాత్తు దారి పక్కనే ఉన్న చెరువులో పడి మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ముథోల్: మండలంలోని ముద్గల్ గ్రామానికి చెందిన సుధాకర్(49) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... సుధాకర్‌కు పదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో ఎడమ కాలుకు దెబ్బతగిలి కోలుకున్నాడు. అప్పటి నుంచి ఆరోగ్యం సహకరించకపోవడంతో మనసికంగా ఇబ్బంది పడుతున్నాడు. దీంతో శుక్రవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఆదుకుందాం... బతుకునిద్దాం

- ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న యువకుడు
- ఆపరేషన్‌కు రూ.3లక్షల ఖర్చు
- ఆసుపత్రికి వెళ్లడానికి డబ్బుల్లేని పరిస్థితి
- కొడుకును బతికించాలని వేడుకుంటన్న తల్లి



మంచంపై నల్ల సతీశ్

బోథ్: ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న తన కొడుకుని బతికించాలని ఆ తల్లి చేతులెత్తి వేడుకుంటోంది. పరిస్థితి విషమంగా ఉందని వెంటనే ఆపరేషన్ చేయాలని, వైద్య ఖర్చులు సుమారుగా రూ.3లక్షలు అవుతాయని వైద్యులు తెలిపారు. రెండు నెలలుగా డబ్బులు లేక ఆపరేషన్ చేయించలేక అలానే ఉండిపోయింది. కళ్ల ఎదుట కన్నకొడుకు చూస్తూ ఆపరేషన్ చేయించలేని పరిస్థితిలో ఉన్న ఆ తల్లి గుండె తల్లడిల్లుతోంది. తన కొడుకును కాపాడాలని వేడుకుంటోంది.

**కడుపేద కుటుంబం...**

బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన నల్ల సతీశ్(30) బతుకుదెరువు కోసం 2020లో దుబాయ్ వెళ్లాడు. అక్కడ పనిచేస్తున్న క్రమంలో ఛాతిలో నొప్పి మొదలైంది. అక్కడ వైద్యం చేయించుకోలేక తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. అక్కడ పనిచేసే పరిస్థితి లేక 2022లో ఇండియాకు తిరిగివచ్చాడు. ఛాతిలో నొప్పి తరచూ వస్తుండడంతో నిజామాబాద్, హైదరాబాద్‌లోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో పరీక్షించుకున్నాడు. ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధి ఉందని, ఆపరేషన్‌కు రూ.3లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. అప్పటికే దాదాపు తల్లి రూ.లక్ష వరకు ఖర్చు చేసింది. మరో 3లక్షలు రూపాయలు ఎలా తేవాలో అర్థం కావడం లేదని ఆ తల్లి మదన పడుతోంది. ఆపరేషన్ చేయించలేక తన కొడుకుని ఇంటి వద్దే ఉంచింది. కనీసం ఆసుపత్రికి వెళ్లేందుకు కూడా ఆర్థిక స్తోమత లేక ఆందోళన చెందుతోంది. దాతలు స్పందించి తన కుమారుడికి ప్రాణభిక్ష పెట్టాలని వేడుకుంటోంది.

**దాతల సాయం కోసం..**

ఫోన్ పే నంబరు :
8008788420 (నల్ల మధుకర్)

బ్యాంకు అకౌంటు వివరాలు:
నల్ల సతీశ్, అకౌంట్ నంబరు :
209110100050899
యూనియన్ బ్యాంక్ (ఆంధ్రాబ్యాంక్),
IFC CODE: ANDB0002091
BQANCH: BOATH

**నా కొడుకును బతికించండి..**



నా కొడుకుకు ఆపరేషన్ చేయించే స్థితిలో లేను. నా కొడుకును బతికించాలి. ఆపరేషన్ కోసం రూ.3లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారు. ఇప్పటికే లక్ష రూపాయలు అప్పుతెచ్చి టెస్టులు చేయించాను. మూడు లక్షలు ఉంటే నా బిడ్డ బతుకుతాడు. దయచేసి సాయం అందించి నా కొడుకును కాపాడాలి.

– నల్ల గంగుబాయి, సతీశ్ తల్లి

## రేషన్‌డీలర్‌ను బహిష్కరించిన గ్రామస్తులు

సిరికొండ: మండలంలోని రిమ్మ గ్రామ పంచాయతీలో నూతనంగా నియమించిన రేషన్ డీలర్‌ను గ్రామస్తులు బహిష్కరించి రేషన్ దుకాణానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో రేషన్ దుకాణ డీలర్‌గా పనిచేసేందుకు అర్హత ఉన్న స్థానికులను కాదని, స్థానికేతరులను నియమించడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో శనివారం నూతనంగా నియామకమైన డీలర్ గ్రామంలోకి వెళ్లడంతో ఆమెను గ్రామం నుంచి వెళ్లగొట్టారు. గ్రామంలో అర్హత ఉన్న వారిని డీలర్‌గా నియమించాలని గ్రామస్తులు తీర్మానించారు.



డీలర్‌ను పంపిస్తున్న గ్రామస్తులు